సాక్షి
యాదాద్రి భువనగిరి
మంగళవారం । 7 । మార్చి । 2023



ముడుపులిస్తేనే రిజిస్ట్రేషన్!

మోత్కూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ముడుపులిస్తేనే రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయని ఆరోపణలు వస్తున్నాయి. - 8లో



మున్సిపల్ బడ్జెట్‌కు ఆమోదం

భువనగిరి మున్సిపాలిటీ 2023-24 సంబంధించి రూ. 50.72 కోట్ల బడ్జెట్‌కు కౌన్సిల్ ఆమోదం పొందింది. - 9లో

గరిష్టం/కనిష్టం
36°/18°

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది. రాత్రి చలిగా ఉంటుంది.

న్యూస్‌రీల్

అర్జీలను వెంటనే పరిష్కరించాలి



దరఖాస్తులను స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

భువనగిరిటౌన్: ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దీపక్‌తివారీ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో వచ్చిన 31 దరఖాస్తులను ఆయన స్వీకరించారు. ఇందులో రెవెన్యూ 25, వ్యవసాయ శాఖ 2, గ్రామీణాభివృద్ధి 2, మున్సిపాలిటీ, మెడికల్ శాఖలకు సంబంధించి ఒక్కొక్కటి ఉన్నాయి. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, కలెక్టరేట్ ఏఓ నాగేశ్వరాచారి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఈవీఎంల పరిశీలన

కలెక్టరేట్‌లో ఉన్న గోదాంలోని ఈవీఎంలను సోమవారం అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి పరిశీలించారు. ప్రతి నెలా ఈవీఎంల పరిశీలనలో భాగంగా తనిఖీ చేసినట్లు తెలిపారు. ఆయన వెంట ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ గిరిధర్ ఉన్నారు.

డబుల్ బెడ్ రూం ఇళ్లకు దరఖాస్తు చేసుకోవాలి

భువనగిరిటౌన్ : భువనగిరి మున్సిపాలిటీ పరిధిలో అర్హులైన వారు డబుల్ బెడ్‌రూం ఇళ్లకు మీ సేవా ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ పమేలా సత్పతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 7 నుంచి 11వ తేదీ వరకు అవకాశం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. భువనగిరి పట్టణంలోని సింగన్నగూడెం వద్ద 444 డబుల్ బెడ్ రూం ఇళ్ల కేటాయింపునకు సిద్ధం చేసినట్లు తెలిపారు.

'గుట్ట' రూరల్ సీఐ బదిలీ

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట రూరల్ సీఐగా బాధ్యతలు నిర్వహిస్తున్న నవీన్‌రెడ్డిని మల్కాజిగిరి సీసీఎస్‌కు బదిలీ చేస్తూ సీపీ చౌహాన్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. మల్కాజిగిరి సీసీఎస్‌లో విధులు నిర్వహిస్తున్న వై.సురేందర్‌రెడ్డిని యాదగిరిగుట్ట రూరల్ సీఐగా నియమించారు. నూతన రూరల్ సీఐ సురేందర్‌రెడ్డి ఒకటి, రెండు రోజుల్లో బాధ్యతలు తీసుకోనున్నారు.

నాలుగు రోజులు నీటి సరఫరా నిలిపివేత

భువనగిరిటౌన్: ఈ నెల 8 నుంచి 11వ తేదీ వరకు జిల్లాకు మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిపి వేయడం జరుగుతుందని మిషన్ భగీరథ డీఈ లక్ష్మణ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ మెట్రో బోర్డు పైపు లైన్లు మరమ్మతుల నేపథ్యంలో జిల్లాకు నాలుగు రోజుల పాటు మంచి నీటి సరఫరా బంద్ చేస్తున్నారని, ప్రజలు గమనించాలని పేర్కొన్నారు. జిల్లాలోని బొమ్మలరామారం, తుర్కపల్లి, రాజాపేట, ఆలేరు, గుండాల, బీబీనగర్, వలిగొండ, భువనగిరి, ఆత్మకూర్, మోటకొండూర్, యాదగిరిగుట్ట, పోచంపల్లి, రామన్నపేట నీటి సరఫరాను నిలిపి వేయబడుతుందని తెలిపారు.

వరద కాలువ పునరుద్ధరణ

సాక్షి ఎఫెక్ట్

చౌటుప్పల్ : మండల పరిధిలోని దండుమల్కాపురం శివారులో గల వరద కాల్వను రియల్ ఎస్టేట్ వ్యాపారులు పూడ్చివేయడంతో 'వరద కాలువను మళ్లీ పూడ్చారు' శీర్షికన 'సాక్షి' సోమవారం కథనాన్ని ప్రచురించింది. దీనికి స్పందించిన అధికారులు రెవెన్యూ, నీటి పారుదల శాఖ అధికారులు పూడ్చివేతకు గురైన కాలువ ప్రాంతానికి వెళ్లారు. నీటిపారుదల శాఖ డీఈ రాజవర్ధన్‌రెడ్డి, తహసీల్దార్ శ్యాంసుందర్‌రెడ్డి లక్కారం గ్రామస్తులతో కలిసి గతంలో ఉన్న కాలువ, ప్రస్తుతం పూడ్చివేసిన విధానాన్ని పరిశీలించారు. నిబంధనలకు విరుద్ధంగా కాలువను పూడ్చడంపై సంబంధిత రియల్టర్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే కాలువను పునరుద్ధరించాలని ఆదేశించారు. వరద కాలువలు తమ పట్టాభూముల్లో ఉన్నప్పటికీ పూడ్చడం కుదరదన్నారు. నిబంధనలు పాటిస్తూ అన్ని రకాల అనుమతులు పొందిన తర్వాతే పూడ్చాల్సి ఉంటుందని పేర్కొన్నారు. అనుమతులు పొందేవరకూ వరద కాలువ యథావిధిగా ఉండాలని సూచించారు. మరోమారు పూడిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వారి వెంట రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ బాణాల రాంరెడ్డి, నీటిపారుదల శాఖ ఏఈ దీప, కౌన్సిలర్ కొయ్యడ సైదులుగౌడ్, మాజీ సర్పంచ్ పాశం సంజయ్‌బాబు, దేప శ్యాంసుందర్, ఆకుల ఇంద్రసేనారెడ్డి, కాసర్ల శ్రీనివాస్‌రెడ్డి, పాశం రఘుపతి, యుగేందర్, కృష్ణయ్య, లింగస్వామి, సత్తయ్య, దయాకర్‌రెడ్డి, ఐలయ్య, బాలరాజు, కృష్ణ, అంజయ్య, రాజు, మహేష్, శంకర్ తదితరులు ఉన్నారు.

● కామదహనం



హోలీ సందర్భంగా ఆలేరు పట్టణంలోని 3వ వార్డులో సోమవారం రాత్రి కామదహనం నిర్వహిస్తున్న స్థానికులు

రెండు వసతి గృహాల మూసివేత

సాక్షి, యాదాద్రి : జిల్లాలో 19 వసతి గృహాలు ఉండగా ఇందులో రెండు వసతి గృహాల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా తక్కువగా ఉంది. దీంతో వీటిని సమీప వసతి గృహాల్లో చేర్చడానికి ప్రాథమికంగా నిర్ణయించారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఈ క్రమబద్ధీకరణ జరగనుంది. ప్రతి సంక్షేమ హాస్టల్‌లో 100 మంది విద్యార్థులు ఉండే వసతి ఉంది. అయితే కనీసం 50 మంది విద్యార్థులైనా ఉండాలి. కానీ కొన్ని వసతి గృహాల్లో విద్యార్థుల సంఖ్య మరీ తక్కువగా ఉంది. దీంతో బీబీనగర్, వలిగొండ సంక్షేమ వసతి గృహాలను తరలించేందుకు అధికారులు సిద్ధం చేశారు. ఈ రెండు చోట్లా విద్యార్థులు తక్కువగా ఉండడమే గాకుండా అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. బీబీనగర్ విద్యార్థులను భువనగిరిలో, వలిగొండ విద్యార్థులను నేలపట్ల వసతి గృహంలో కలుపనున్నారు. ప్రాథమిక నివేదికను ప్రభుత్వానికి పంపించారు.

'టోల్' మోత!

- పెరగనున్న టోల్ రుసుము
- జీడీపీ రేటు ఆధారంగా నిర్ణయం
- సొంత వాహనాలపై 5-10లోపు, వాణిజ్య వాహనాలపై 12శాతం ఉంటుందని అంచనా
- ఏప్రిల్ 1 నుంచి నుంచి అమలు



చౌటుప్పల్ మండలం పంతంగిలోని జీఎమ్మార్ టోల్‌ప్లాజా

చౌటుప్పల్ : టోల్‌ప్లాజాలు ఉన్న జాతీయ రహదారులతోపాటు రాష్ట్రీయ రహదారులపై ప్రయాణించే వాహనాలకు టోల్ రుసుం పెంచాలని ఎన్‌హెచ్‌ఏఐ ప్రతిపాదించింది. దీనిని కేంద్ర రోడ్డు రవాణా మంత్రిత్వ శాఖ సూత్రప్రాయంగా అంగీకరించింది. అన్ని అనుకూలిస్తే ఏప్రిల్ 1వ తేదీ నుంచి అమలు చేయనున్నారు. ఇదే జరిగితే ఆయా రహదారులపై రాకపోకలు సాగించే లక్షలాది వాహనదారులపై పెనుభారం పడనుంది.

5– 12శాతం వరకు

ప్రస్తుతం వసూలు చేస్తున్న రుసుముకు అదనంగా ఎంత వరకు వసూలు చేయాలన్న విషయంలో ఇంకా స్పష్టత రాలేదు. కానీ కనీసం 5– 12శాతం వరకు అదనంగా వసూలు చేసే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. వాణిజ్య రవాణాకు చెందిన భారీ వాహనాలకు ప్రస్తుతం ఉన్న రుసుముకు అదనంగా 10–12శాతం వరకు పెంచనున్నారు. అదే సందర్భంలో నాలుగు చక్రాలు కలిగిన వాణిజ్యరహిత(సొంత) వాహనాలకు అదనంగా 5శాతానికి తగ్గకుండా రుసుము ఉండనుంది. ఈ ప్రకారంగా సొంత వాహనాలకు అంతగా భారం పడనప్పటికీ నిత్యం వందలాది కిలోమీటర్ల మేర వివిధ రాష్ట్రాల మీదుగా రాకపోకలు సాగించే వాణిజ్య వాహనాలపై తీవ్ర భారమే పడనుంది.

దేశవ్యాప్తంగా ఒకే విధంగా..

జాతీయ రహదారులపై టోల్‌ప్లాజాల వద్ద రుసుమును దేశవ్యాప్త జీడీపీ రేటు ఆధారంగా నిర్ణయించనున్నారు. పెరిగే టోల్ రుసుము దేశవ్యాప్తంగా ఒకే విధంగా ఉండనుంది. కాగా ప్రస్తుతం టోల్‌ప్లాజాల వద్ద వసూలు చేస్తున్న రుసుములు మాత్రం ఆయా ప్రాజెక్టుల మొత్తం విలువ, రాకపోకలు సాగిస్తున్న వాహనాల వివరాల ఆధారంగా నిర్ణయించారు. దీనిప్రకారం ఒక్కో టోల్‌ప్లాజా వద్ద ఒక్కో రకమైన రుసుము వసూలు చేస్తున్నారు.

రవాణా వాహనాలపై పెనుభారం

టోల్ రుసుము పెంపుతో అన్ని రకాల వాహనదారులపై భారం పడనుంది. సొంత వాహనాలతో పాటు వాణిజ్య, సరుకు రవాణా వాహనాల టోల్ రేట్లు పెరగనున్నాయి. ప్రధానంగా వాణిజ్య, సరుకు రవాణా వాహనాలపై పెనుభారం పడనుంది. ప్రతిరోజు పలు టోల్‌ప్లాజాల మీదుగా వందలాది కిలోమీటర్ల రాకపోకలు సాగించే ఈ వాహనాల టోల్ రుసుము తడిసి మోపెడు కానుంది. అదే విధంగా టోల్‌ప్లాజాకు 20కిలోమీటర్ల దూరం లోపు కలిగిన గ్రామస్తులకు ప్రస్తుతం పాస్‌లు జారీ చేశారు. వారు ప్రయాణం చేసే ప్రాంతాలను బట్టి ధరను నిర్ణయించారు. ఆ ప్రకారంగా ప్రస్తుతం టోల్ రుసుము పెరిగితే వీరిపైనా భారం పడనుంది. మొత్తంగా ఉమ్మడి నల్లగొండ జిల్లా పరిధిలో జాతీయ రహదారులకు సంబంధించి చౌటుప్పల్, కొర్లపహాడ్, గూడూరు ప్రాంతాల్లో టోల్‌ప్లాజాలు ఉన్నాయి. వీటి పరిధిలో ప్రతినిత్యం సుమారుగా 60– 70వేల వాహనాల రాకపోకలు సాగిస్తుంటాయి. సెలవులు, వారాంతపు రోజుల్లో ఈ సంఖ్య మరింత అధికంగా ఉంటుంది.

స్థానికులకు మినహాయింపు ఇవ్వాలి



టోల్‌ప్లాజా వద్ద స్థానికులకు రుసుము వసూలు నుంచి మినహాయింపు ఇవ్వాలి. వ్యాపారం నిమిత్తం నేను తరుచుగా చౌటుప్పల్ నుంచి నల్లగొండకు రాకపోకలు సాగిస్తాను. నెలవారీ పాస్ తీసుకున్నా. ఎలాంటి రుసుము లేకుండా పాస్‌లు ఇవ్వాలి. స్థానికులకు పూర్తిగా మినహాయింపు ఇవ్వాలి.

– వక్కంటి రాజాచంద్ర, వాహనదారుడు, చౌటుప్పల్

నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి



ఇప్పటికే వాహనదారులు రకరకాల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఫైనాన్స్‌ల ఈఎంఐలు కూడా కట్టలేకపోతున్నాం. ఫలితంగా అప్పుల పాలవుతున్నాం. వాటికి తోడు టోల్ రుసుముల సమస్య ఇప్పటికే తీవ్రంగా ఇబ్బంది పెడుతుంది. మరోసారి రుసుము పెంచాలన్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి.

– పొలమోని నర్సింహయాదవ్, లారీ యజమాని, పెద్దకొండూర్, చౌటుప్పల్

టోల్ రుసుము పెరుగుతుంది



టోల్‌ప్లాజాలు కలిగిన జాతీయ రహదారులపై రాకపోకలు సాగించే వాహనాలకు సంబంధించిన టోల్ రుసుము పెరగనుంది. ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఎంతమేరకు ధరలు పెరగనున్నాయన్న విషయంలో ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. దేశవ్యాప్తంగా జీడీపీ రేటును ఆధారంగా చేసుకొని ఎంత మేరకు రుసుమును పెంచాలని నిర్ణయిస్తారు.

– శ్రీధర్‌రెడ్డి, జీఎంఆర్ టోల్‌ప్లాజా మేనేజర్

ప్రమాద సమయాల్లో సీపీఆర్ కీలకం

- భువనగిరి రూరల్, పట్టణ పోలీస్ స్టేషన్ సిబ్బందికి సీపీఆర్‌పై అవగాహన



సీపీఆర్ విధానంపై అవగాహన కల్పిస్తున్న ఈఎంఆర్‌ఐ నిర్వాహకులు

భువనగిరి : భువనగిరి రూరల్, పట్టణ పరిధిలోని పోలీస్ స్టేషన్ల సిబ్బందికి సోమవారం పట్టణ శివారులోని దీప్తి హోటల్‌లో రాష్ట్ర పోలీస్ రోడ్ సేఫ్టీ, జీవీకే ఈఎంఆర్‌ఐ ఆధ్వర్యంలో సీపీఆర్(కార్డియో పుల్మనరీ రిససిటేషన్) పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఈఎంఆర్‌ఐ ప్రతినిధి జావిద్ మాట్లాడుతూ సీపీఆర్ విధానాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలన్నారు. రోడ్డు ప్రమాదాలు, ప్రమాద ఘటనలు జరిగిన సమయంలో ఈ ప్రక్రియ కీలకంగా పనిచేస్తుందన్నారు. గుండె స్తంభించినప్పుడు, ఊపిరితిత్తుల్లో శ్వాస తీసుకోవడం సమస్యగా ఉంటే వెంటనే సీపీఆర్ చేయడం ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. ప్రతిఒక్కరికి సీపీఆర్‌పై అవగాహన ఉండేలా చర్యలు తీసుకుంటున్న తెలిపారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ సీఐ నాగార్జున, భువనగిరి ట్రాఫిక్ సీఐ సతీష్, జితేందర్‌రెడ్డి, ఎస్సై రాఘవేందర్‌గౌడ్, వెంకటేష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



క్రీడాపోటీల్లో పాల్గొన్న మహిళా ఉద్యోగులు



రింగ్‌బాల్ ఆడుతున్న కలెక్టర్

కలెక్టరేట్‌లో క్రీడాపోటీలు

భువనగిరిటౌన్ : ఈ నెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం కలెక్టరేట్‌లో మహిళా ఉద్యోగులకు క్రీడా పోటీలు నిర్వహించారు. పోటీలను ప్రారంభించిన కలెక్టర్ పమేలా సత్పతి కొద్దిసేపు టెన్నికాయిట్ ఆడారు. అనంతరం ఫన్ గేమ్స్ నిర్వహించారు. మహిళలకు కలెక్టర్ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. క్రీడా పోటీల్లో సుమారు 150 మంది మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా యువజన క్రీడాల శాఖ అధికారి ధనుంజనేయులు పాల్గొన్నారు.

వడ్డీ డబ్బులొచ్చాయి

- మహిళా సంఘాల బ్యాంకు లింకేజీ రుణాల వడ్డీ విడుదల
- సెర్ప్, మెప్మాలకు రూ.46.54 కోట్లు
- మహిళా దినోత్సవం సందర్భంగా ఖాతాల్లో జమ కానున్న వడ్డీ డబ్బులు



సాక్షి, యాదాద్రి : ఎట్టకేలకు మహిళా సంఘాల బ్యాంకు లింకేజీ రుణాల వడ్డీని ప్రభుత్వం విడుదల చేసింది. మహిళా దినోత్సవం సందర్భంగా పెండింగ్‌లో ఉన్న సెర్ప్, మెప్మా మహిళలకు వడ్డీ రూ.46.54 కోట్లు విడుదల అయ్యాయి. ఇందులో సెర్ప్‌కు రూ.42.52 కోట్లు, మెప్మాకు రూ.4.02 కోట్లు ఉన్నాయి. జిల్లా కేంద్రంలో మార్చి 8న జరిగే మహిళా దినోత్సవంలో పంపిణీ చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. కాగా.. ప్రభుత్వం 2019-20, 2020- 21 సంవత్సరానికి జిల్లాలోని 12,040 సంఘాలకు రూ. 46.54 కోట్లు విడుదల చేసింది.

2021–22, 2022–23కు సంబంధించి వడ్డీ బకాయి..

మహిళల స్వయం సమృద్ధి కోసం ప్రభుత్వం బ్యాంకు లింకేజీ ద్వారా మహిళా సంఘాలకు రుణాలను అందిస్తోంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనే ఈ పథకం ప్రభుత్వం ప్రవేశపెట్టింది. బ్యాంకులో తీసుకున్న రుణం వాయిదాల ప్రకారం సక్రమంగా చెల్లించిన సంఘాలకు ప్రభుత్వం వడ్డీరాయితీని ఇస్తోంది. అయితే 2019 తర్వాత ఇప్పటివరకు మళ్లీ వడ్డీ రాయితీని సంఘాల ఖాతాల్లో ప్రభుత్వం జమ చేయలేదు. గడిచిన మూడు సంవత్సరాలుగా స్వయం సహాయక సంఘాల మహిళలు వడ్డీ కోసం ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం గతంలో విడుదల చేస్తామని ప్రకటించినప్పటికీ కార్యరూపం దాల్చలేదు. అయితే దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న వడ్డీ పంపిణీ చేస్తామని ప్రభుత్వం ఇటీవల జరిగిన బడ్జెట్ సమావేశాల్లో ప్రకటించింది. ఈమేరకు ప్రభుత్వం జిల్లాలోని స్వయం సహాయక సంఘాలకు రూ.42.52 కోట్లు వడ్డీని విడుదల చేసింది. జిల్లాలోని 2019–20 ఆర్థిక సంవత్సరానికి 12,279 సంఘాలకు ఇచ్చిన రూ.253 కోట్లకు వడ్డీ రూ.36.47 కోట్లు, 2018–19 ఆర్థిక సంవత్సరంలో డిసెంబర్, జనవరి, ఫిబ్రవరి, మార్చి ఆర్థిక సంవత్సరానికి 12,040 సంఘాలకు రూ.6.05 కోట్ల వడ్డీ బకాయిలను ప్రభుత్వం విడుదల చేసింది. కాగా 2021–22, 2022–23 సంవత్సరానికి వడ్డీ ఇంకా ప్రభుత్వం వద్ద బకాయి ఉంది. కరోనా సమయంలో సకాలంలో వాయిదాలు చెల్లించిన తమకు వడ్డీ బకాయిలను పూర్తిగా ఇవ్వాలని మహిళా సంఘాల ప్రతినిధులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

మెప్మాకు రూ.4.02 కోట్ల విడుదల

జిల్లాలోని 6 మున్సిపాలిటీల పరిధిలోని మహిళా సంఘాలకు రూ.4.02 కోట్లు విడుదలయ్యాయి. 2018–19, 2019–20 సంవత్సరానికి గాను 2,673 సంఘాలకు వడ్డీ విడుదల చేశారు.

8వ తేదీన ఖాతాల్లో జమ

బ్యాంకు లింకేజీ వడ్డీని అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఈ నెల 8వ తేదీన ఆయా సంఘాల ఖాతాల్లో జమ చేయనున్నారు. ఇందుకోసం ఇప్పటికే సంఘాల వారీగా సభ్యులు తీసుకున్న రుణాల వివరాలు తీసుకున్నారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసే కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న మహిళా సంఘాల ప్రతినిధులకు చెక్‌ను అందజేయడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

వడ్డీ బకాయిలు ఇవ్వడం హర్షణీయం



మా సంఘంలో పదిమంది సభ్యులు ఉన్నారు. గతంలో రూ.5లక్షల రుణం తీసుకొని వడ్డీతో సహా పూర్తిగా చెల్లించాం. రెండేళ్ల క్రితం మరో రూ.10లక్షల రుణం తీసుకుని క్రమం తప్పకుండా వాయిదాలు చెల్లిస్తున్నాం. పాత రుణానికి సంబంధించిన వడ్డీతోపాటు ప్రస్తుతం తీసుకున్న రుణానికి సంబంధించిన వడ్డీబకాయిలు రావాల్సి ఉంది. రెండేళ్ల వడ్డీ చెల్లిస్తున్నట్లు ప్రకటించడం హర్షణీయం. మిగిలిన బకాయిలు చెల్లిస్తే సంఘాల రుణభారం తగ్గుతుంది.

– కర్రె లావణ్య, స్వాతి సమభావన సంఘం, రామన్నపేట

కోతులు, కుక్కల నుంచి కాపాడాలి

- కాలనీల్లో పారిశుద్ధ్య సమస్య పరిష్కరించాలి
- వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేయాలి
- 'సాక్షి ఫోన్‌ఇన్'లో సమస్యలు విన్నవించిన యాదగిరిగుట్ట పట్టణ వాసులు
- సమస్యలు పరిష్కరిస్తామని మున్సిపల్ కమిషనర్ హామీ

సాక్షి ఫోన్‌ఇన్



ఫోన్‌లో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్‌రెడ్డి

యాదగిరిగుట్ట : యాదగిరిగుట్ట మున్సిపాలిటీలో కోతులు, కుక్కల బారి నుంచి కాపాడాలని, పారిశుద్ధ్య సమస్యలు పరిష్కరించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. 'సాక్షి' ఆధ్వర్యంలో సోమవారం ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్‌రెడ్డితో నిర్వహించిన ఫోన్‌ఇన్ కార్యక్రమంలో ప్రజలు తమ సమస్యలను విన్నవించారు. ప్రధానంగా కాలనీల్లో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మించాలని, వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్‌లను ఏర్పాటు చేయాలని కోరారు. ఈమేరకు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్‌రెడ్డి హామీ ఇచ్చారు.

ప్రశ్న : 5వ వార్డులో కోతుల బెడద ఉంది.

– గుండు నర్సింహగౌడ్, 5వ వార్డు, విక్రమ్, బీసీ కాలనీ, లింగం, గుండ్లపల్లి

కమిషనర్ : గతంలో ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటు కోతులను పట్టించాం. త్వరలోనే మళ్లీ కోతులను పట్టుకుని వేరే ప్రాంతాలకు తరలించే ప్రయత్నం చేస్తాం. పట్టణంలో కోతులను వదిలేసి వెళ్తున్న అంశం మా దృష్టికి వచ్చింది. అలాంటి వారిపై చర్యలు తీసుకునేందుకు సిద్ధమయ్యాం.

ప్రశ్న: యోగానంద నిలయం పక్కన ఏర్పాటు చేసిన ఓపెన్ డ్రెయినేజీలో చెత్తాచెదారం పేరుకుపోయింది. – భువనగిరి శ్యాంసుందర్, అంగడి బజార్

కమిషనర్ : వేసవిలో ఓపెన్ డ్రెయినేజీని శుభ్రం చేయాలని అనుకున్నాం. గతంలోనే మున్సిపల్ ఎజెండాలో పెట్టాం. నిధులు సైతం కేటాయించాం. త్వరలోనే చెత్తాచెదారం తొలగిస్తాం.

ప్రశ్న : శ్రీరాంనగర్ నుంచి కొత్త గుండ్లపల్లి వరకు కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి.

– పచ్చిమట్ల నరేష్, 7వ వార్డు

కమిషనర్ : కుక్కల నివారణకు చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే పాఠశాలల్లో పిల్లలకు అవగాహన కల్పిస్తున్నాం.

ప్రశ్న : గుట్ట గ్రామ పంచాయతీ ఉన్నప్పుడు, మున్సిపాలిటీ అయిన తరువాత ఏర్పడిన వెంచర్లలో ఉన్న 10శాతం భూములను రక్షించాలి. అందులో పార్కులను ఏర్పాటు చేయాలి.

– బొజ్జ సాంబేష్, గుండ్లపల్లి

కమిషనర్ : మున్సిపాలిటీలో ఉన్న వెంచర్లలో 10 శాతం భూములను రక్షిస్తున్నాం. ఇప్పటికే పలు వెంచర్లలో పట్టణ ప్రకృతి వనాలు, పార్కులు, చిన్నారులు ఆడుకునేందుకు సామగ్రిని ఏర్పాటు చేశాం.

ప్రశ్న : 3వ వార్డులోని ఎస్సీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రం వెనకాల గుంతను తీశారు. అందులో నీరు చేరి దుర్వాసన వస్తోంది. శ్మశాన వాటికలో డంపింగ్ చెత్తను కాల్చి వేస్తున్నారు. కొత్త గుండ్లపల్లిలో శ్మశాన వాటిక పూర్తికాలేదు.

– గుండ్ల నరేష్, 3వ వార్డు, బండి అనిల్, కొత్త గుండ్లపల్లి

కమిషనర్ : అంగన్‌వాడీ కేంద్రం వెనకాల ఉన్న గుంతను పూడ్చి వేస్తాం. అతి త్వరలోనే డంపింగ్ యార్డును పట్టణానికి దూరంగా ఏర్పాటు చేస్తాం.

ప్రశ్న : మున్సిపాలిటీ పరిధిలో వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలి.

– కసావు శ్రీనివాస్‌గౌడ్, 4వ వార్డు

కమిషనర్ : గుట్ట పట్టణంలో వాకింగ్ ట్రాక్‌తో పాటు ఓపెన్ జిమ్‌లను ఏర్పాటు చేసేందుకు కసరత్తు చేస్తున్నారు. ఇప్పటికే యాదగిరిపల్లిలో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేశాం. అంగడి బజార్ సమీపంలో, బీసీ కాలనీలో వాకింగ్ ట్రాక్‌తో పాటు ఓపెన్ జిమ్‌లను నిర్మిస్తాం.

శ్మశాన వాటికలో చెత్తను తగలబెట్టకుండా చర్యలు తీసుకుంటాం. వర్షాలు అధికంగా పడడంతో కొత్త గుండ్లపల్లిలో శ్మశాన వాటిక పనులు నెమ్మదిగా సాగాయి. వచ్చే నెలలో పూర్తి చేస్తాం.

ప్రశ్న: లోటస్ టెంపుల్ వద్ద రోడ్డు సరిగ్గా లేదు. ప్రశాంత్‌నగర్ ఏరియాలో రోడ్డు అస్తవ్యస్తంగా ఉంది.

– సాయికుమార్, లోటస్ టెంపుల్ ఏరియా, శ్రీదేవి, ప్రశాంత్‌నగర్

కమిషనర్ : ఏఈని పంపించి పరిశీలిస్తాం. రిపోర్టు ఆధారంగా సమస్యను పరిష్కరించేలా చర్యలు చేపడతాం.

ప్రశ్న : కొత్త గుండ్లపల్లిలోని 2–1 ఇంటి నుంచి 2–11 వరకు డ్రెయినేజీ సరిగ్గా లేదు. 6వ వార్డులో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ కోసం పూడికలు తీశారు. పైప్‌లైన్ వేసి పనులు అసంపూర్తిగా వదిలేశారు.

– బొజ్జ కృష్ణ, కొత్త గుండ్లపల్లి, కళ్లెం కృష్ణ, 6వ వార్డు

కమిషనర్ : మున్సిపాలిటీ ఏఈని పంపించి ఫీల్డ్ పరిశీలిస్తాం. సమస్యను పరిష్కరించే దిశగా కృషి చేస్తాం.

ప్రశ్న : గుట్ట మున్సిపాలిటీ కార్యాలయంలో మండుటెండకు వృద్ధులకు పింఛన్లు ఇస్తున్నారు. అందరికి ఒకే చోటా కాకుండా ఆయా కాలనీల్లో కేంద్రాలు ఏర్పాటు చేసి పింఛన్ ఇవ్వాలి.

– బిలిదె అశోక్, గుట్ట మెయిన్‌రోడ్డు

కమిషనర్ : ఇప్పటికే ఇందిరా వికలాంగుల కాలనీలో సెంటర్ ఏర్పాటు చేసి పింఛన్ ఇస్తున్నాం. ఆయా కాలనీల్లోకి వెళ్లి పింఛన్ ఇచ్చే విధంగా చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న : గుట్ట పట్టణంలో మూత్రశాలలు, మరుగుదొడ్లు లేవు. దీంతో భక్తులకు, స్థానిక ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

– తాళ్ల రాంరెడ్డి, పాతగుండ్లపల్లి

కమిషనర్: పట్టణంలో మూత్రశాలలు, మరుగుదొడ్లు ఏర్పాటు చేయడానికి కృషి చేస్తున్నాం.

ప్రశ్న : పట్టణంలో నూతనంగా ఇళ్ల నిర్మాణం చేసుకుంటున్న యజమానులు రోడ్లపైనే ఇసుక, కంకర పోస్తున్నారు. దీంతో వాహనాదారులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

– కీసరి బాలరాజు, కొత్త గుండ్లపల్లి

కమిషనర్: ఇంటి నిర్మాణాలు చేసుకునే వారు రోడ్లపై కంకర, ఇసుక, ఇతర సామగ్రి వేయొద్దని హెచ్చరిస్తాం.

ప్రశ్న: పట్టణంలో ఇళ్ల మధ్యన చెత్తను సరిగ్గా సేకరించడం లేదు. – జానీ మహ్మద్, గాంధీనగర్

కమిషనర్: మున్సిపల్ పారిశుద్ధ్య సిబ్బందికి కౌన్సిలింగ్ ఇస్తాం. చెత్తను తగలబెట్టవద్దని సూచిస్తాం.

ప్రశ్న: 12వ వార్డులో పందులు విపరీతంగా ఉన్నాయి. – కొమ్మగాని నర్సింహగౌడ్

కమిషనర్: పట్టణంలో ఉన్న పందులను తరలించే విధంగా చర్యలు తీసుకుంటున్నాం.

ప్రశ్న : పాతగుట్ట, గాంధీనగర్, యాదగిరిపల్లి, బీసీ కాలనీలకు వెళ్లే రోడ్డు మార్గాలు పూర్తిగా ధ్వంసమయ్యాయి.

– నంగునూరి బాలరాజు, శ్రీరాంనగర్

కమిషనర్: ఆయా ప్రాంతాల్లో రోడ్లను పరిశీలిస్తాం. ఏర్పడిన గుంతలను పూడ్చివేసి మరమ్మతులు చేయిస్తాం.

ప్రశ్న: యాదగిరిపల్లి మసీద్ నుంచి పాతగుండ్లపల్లి బాయ్స్ హాస్టల్ వరకు వీధి దీపాలు లేవు.

– నవీన్‌కుమార్, యాదగిరిపల్లి

కమిషనర్: సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటాం.

క్లుప్తంగా

నెమురుగొమ్ముల శారదకు కేంద్ర మంత్రి నివాళి



నివాళులర్పిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

తిరుమలగిరి (తుంగతుర్తి) : భారతీయ జనతా పార్టీ సెంట్రల్ అధ్యక్షుడు, తొండ గ్రామానికి చెందిన నెమురుగొమ్ముల గౌతమ్‌రావు మాతృమూర్తి శారదాదేవి ఇటీవల మరణించారు. సోమవారం నిర్వహించిన దశదిన కర్మకు కేంద్ర పర్యాటక శాఖ మంత్రి కిషన్‌రెడ్డి, తుంగతుర్తి, డోర్నకల్ ఎమ్మెల్యేలు గాదరి కిషోర్‌కుమార్, రెడ్యానాయక్, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, మాజీ ఎమ్మెల్యే రాంరెడ్డి దామోదర్‌రెడ్డి, సంకినేని వెంకటేశ్వరరావు వేర్వేరుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శారదా దేవి చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు.

రైలు కిందపడి వ్యక్తి మృతి

బీబీనగర్: రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన మండలంలోని బీబీనగర్– ఘట్‌కేసర్ రైలు మార్గంలో కొండమడుగు మెట్టు సమీంపలో సోమవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ నాగేశ్వర్‌రావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సుమారు 35సంవత్సరాలు కలిగి ఉన్న యువకుడు తెల్లవారుజామున 3గటంల ప్రాంతంలో బీబీనగర్ రైల్వే స్టేషన్ గుండా హైదరాబాద్ వైపు వెళ్తున్న గుర్తుతెలియని రైలులో ప్రయాణిస్తూ ప్రమాదవశాత్తు జారి రైలు కింద పడి మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని భువనగిరి ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గంజాయి కేసులో మరొకరి అరెస్టు

చౌటుప్పల్ : చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో ఈనెల 4న భారీ ఎత్తున పట్టుబడిన గంజాయి కేసులో పోలీసులు సోమవారం మరో వ్యక్తిని అరెస్టు చేశారు. ఆంధ్రప్రదేశ్ నుంచి హైదరాబాద్ మీదుగా మహారాష్ట్రకు అక్రమంగా గంజాయిని తరలిస్తుండగా పోలీసులకు పట్టుబడిన విషయం తెలిసిందే. ఆంధ్రాలో నిందితులకు గంజాయి ఇప్పించిన అనకాపల్లి జిల్లా గొలుగొండ మండలం కృష్ణదేవపేట గ్రామానికి చెందిన ఇంటి సంతోష్‌ను సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇదే కేసులో ఇప్పటికే హన్మకొండకు చెందిన బానోతు వీరన్న, శ్రీశైలంకు చెందిన కర్రె శ్రీశైలం, హైదరాబాద్‌కు చెందిన కేతావత్ శంకర్, వరంగల్‌కు చెందిన పంజా సూరయ్యను అరెస్ట్ చేసినట్లు సీఐ మల్లికార్జున్‌రెడ్డి తెలిపారు.

డీజిల్ ట్యాంకర్ సీజ్

నల్లగొండ : హైదరాబాద్ ఐఓఎస్ బంక్ నుంచి ఎలాంటి లైసెన్స్, ధ్రువపత్రాలు లేకుండా నల్లగొండకు డీజిల్ తీసుకొచ్చిన ట్యాంకర్‌ను పౌరసరఫరాల అధికారులు సోమవారం సీజ్ చేశారు. సమాచారం మేరకు అధికారులు వెళ్లి హైదరాబాద్ రోడ్డు నుంచి నల్లగొండకు వస్తున్న ట్యాంకర్‌ను పట్టుకొని విచారించగా లైసెన్స్, ధ్రుపత్రాలు వారి వద్ద లేవు. హైదరాబాద్ నుంచి నల్లగొండ ఆర్టీసీ డిపోకు డీజిల్ సరఫరాకు వచ్చినట్లు డ్రైవర్ రాహుల్‌రెడ్డి పేర్కొంటున్నట్లు అధికారులు తెలిపారు. లైసెన్స్ లేకపోవడంతో 6ఏ కేసు నమోదు చేసినట్లు డీఎస్ఓ వెంకటేశ్వర్లు తెలిపారు.

చికిత్స పొందుతున్న మహిళ మృతి

వలిగొండ : ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మహిళ మృతిచెందింది. మండల కేంద్రానికి చెందిన పబ్బతి పద్మ(42)కు పబ్బతి వెంకటేశంతో ఎనిమిది సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వీరికి సంతానం లేకపోవడంతో మనస్తాపంతో జీవితంపై విరక్తి చెందిన పద్మ ఫిబ్రవరి 22న వారి ఇంట్లో ఉన్న బాత్రూమ్ క్లీన్ చేసే యాసిడ్ తాగింది. గమనించిన భర్త వెంకటేశం వెంటనే స్థానికంగా ఉన్న ప్రైవేటు ఆస్పత్రికి తరలించాడు. పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడి నుంచి సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందింది. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రభాకర్ తెలిపారు.

ముడుపులిస్తేనే రిజిస్ట్రేషన్ !

- మోత్కూరు సబ్ రిజిస్ట్రార్‌పై బాధితుల ఆరోపణ
- పోలీస్‌స్టేషన్ వరకు వెళ్లిన వివాదం

మోత్కూరు : మోత్కూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ముడుపులిస్తేనే రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. బాధితులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మోత్కూరు మండలంలోని రాగిబావి గ్రామానికి చెందిన నారబోయిన వెంకటేష్ తన ఇంటిని రిజిస్ట్రేషన్ చేయించుకోవడానికి సోమవారం కార్యాలయంలో సబ్ రిజిస్ట్రార్ వద్దకు వెళ్లాడు. అధిక మొత్తంలో డబ్బులు డిమాండ్ చేయడంతో ఇద్దరి మధ్య తీవ్ర స్థాయిలో వాగ్వాదం జరిగింది. దీంతో సబ్ రిజిస్ట్రార్‌పై బాధితుడు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో ఎస్‌ఐ ఇరువురిని పిలిపించి జరిగిన విషయాన్ని తెలుసుకొని రాజీ కుదిర్చి పంపాడు. మోత్కూరులో నాన్ అగ్రికల్చర్ కింద 7గుంటల భూమిని రూ.1.30 లక్షలు చలాన్ చెల్లించి రిజిస్ట్రేషన్ కోసం వెళ్లిన బూడిద రాములు, అన్నెపు నర్సింహ వద్ద రూ.30 వేలు సబ్ రిజిస్ట్రార్



మోత్కూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

వసూలు చేశాడని రియల్టర్ ఉప్పలయ్య ఆరోపించారు. అడ్డగూడూరు మండలంలోని లక్ష్మీదేవికాల్వ గ్రామానికి చెందిన బొమ్మగాని లక్ష్మయ్య తన ఇంటిని రిజిస్ట్రేషన్ చేయించుకోవడానికి రూ.21వేలు చలాన్ చెల్లించగా రూ.10 వేలు సబ్ రిజిస్ట్రార్ ముడుపులు వసూలు చేశాడని ఆరోపించారు. వినియోగదారులు, డాక్యుమెంట్ రైటర్ల పట్ల సబ్ రిజిస్ట్రార్ అనుచితంగా వ్యవహరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

నేటినుంచి డాక్యుమెంట్ రైటర్ల దుకాణాలు బంద్

మోత్కూరు సబ్ రిజిస్ట్రార్ సురేందర్ నాయక్ అనుచితంగా వ్యవహరించడాన్ని నిరసిస్తూ ఈ నెల 8, 9, 10 తేదీల్లో డాక్యుమెంట్ రైటర్ దుకాణాల బంద్ నిర్వహించనున్నట్లు ఎం.డి.అహ్మద్, తొగిటి కృష్ణ, బయ్యని గిరి, బయ్యని నవీన్, కంచర్ల క్రాంతికుమార్‌రెడ్డి తెలిపారు. సబ్ రిజిస్ట్రార్ సురేందర్‌నాయక్ వినియోగదారుల నుంచి అధిక మొత్తంలో డబ్బులు డిమాండ్ చేస్తున్నాడని ఆరోపించారు. సంబంధిత అధికారులు సబ్ రిజిస్ట్రార్‌పై విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆరోపణలు అవాస్తవం



“ డబ్బులు వసూలు చేస్తున్నానని నాపై వచ్చిన ఆరోపణలు అవాస్తవం. పోలీస్‌స్టేషన్‌కు వ్యక్తిగత సమస్యపై వెళ్లా. డాక్యుమెంట్లలో లోపాలు ఉండటంతో వచ్చిన వినియోగదారులకు ఇలా కాదని చెప్పడంతో తనపై గిట్టని వారు బదనాం చేస్తున్నారు. డాక్యుమెంట్ రైటర్లు నన్ను బ్లాక్‌మెయిల్ చేస్తున్నారు.

– సురేందర్‌నాయక్, సబ్ రిజిస్ట్రార్

రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి దుర్మరణం

భువనగిరి : వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు దుర్మరణం చెందారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో చోటు చేసుకున్న ఈ ఘటనల వివరాలు ఇలా ఉన్నాయి. భువనగిరి మండలంలోని ఎంబావికి చెందిన బొక్క పురేందర్‌రెడ్డి(42), అతని స్నేహితుడు మోటకొండూర్ మండలం చామాపూర్ గ్రామానికి చెందిన దాసరి రాజిరెడ్డి భువనగిరిలో వేర్వేరుగా అద్దెకు నివాసం ఉంటున్నారు. ఇద్దరు కలిసి స్వగ్రామంలోని బొక్క పురేందర్‌రెడ్డి వ్యవసాయ బావి వద్దకు వెళ్లారు. తిరిగి బైక్‌పై మధ్యాహ్నం భువనగిరికి వస్తుండగా నందనం గ్రామ సమీపంలో భువనగిరి నుంచి వలిగొండ వైపునకు వెళ్తున్న గుర్తుతెలియని వాహనం ఎదురుగా ఢీకొట్టింది. దీంతో పురేందర్‌రెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు, తీవ్రంగా గాయపడిన రాజిరెడ్డిని భువనగిరిలోని జిల్లాకేంద్ర ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పురేందర్‌రెడ్డి మృతిదేహానికి పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడి భార్య కల్పన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్సై రాఘవేందర్‌గౌడ్ తెలిపారు.



పురేందర్‌రెడ్డి(ఫైల్)



మల్లేష్ (ఫైల్)

బైక్ ఢీకొని..

యాదగుట్ట రూరల్ : మోటకొండూర్‌కు చెందిన భూమండ్ల మల్లేష్ (43) గొర్రెల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల యాదగిరిగుట్ట మండలం బాహుపేటలోని అత్తవారింటికి వెళ్లాడు. పండుగ ఉత్సవాల అనంతరం తిరిగి సోమవారం మధ్యాహ్నం సమయంలో మోట కొండూర్ గ్రామానికి వద్దామని, అత్తవారింటి నుంచి నడుచుకుంటూ వస్తున్నాడు. ఈ క్రమంలో అదే గ్రామానికి పండుగ ఉత్సవాల కోసం వచ్చిన ఆలేరు మండలం మంతపురి గ్రామానికి చెందిన యువకుడు బిటుకూరి అనిల్ ద్విచక్ర వాహనంతో మల్లేష్‌ను ఢీ కొట్టాడు. దీంతో మల్లేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతడిని ఆలేరులోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

సైకిల్ వినియోగంతో ఆరోగ్యకరమైన జీవనశైలి

- ఎయిమ్స్ డైరెక్టర్ వికాస్ భాటియా

బీబీనగర్: మానవులు సైకిల్ వినియోగించడం ద్వారా ఊబకాయాన్ని తగ్గించుకుని ఆరోగ్యజీవనశైలిని ఏర్పరుచుకోవచ్చని ఎయిమ్స్ డైరెక్టర్ వికాస్ భాటియా సూచించారు. ప్రపంచ ఊబకాయం దినోత్సవం సందర్భంగా సోమవారం ఎయిమ్స్ వద్ద ఉద్భవ్ 2023. సైక్లోథాన్‌లో భాగంగా మెడికల్ విద్యార్థులు, ఫ్యాకల్టీ, నర్సింగ్ అధికారులు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించేందుకు సైకిల్ వినియోగం అవసరమని తద్వారా ఆరోగ్య లాభాలు చేకురుతాయని తెలిపారు. కార్యక్రమంలో ఎయిమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ నీరజ్ అగర్వాల్, వైద్యులు రష్మి కుందాపూర్, నితిన్ జాన్, శ్యామల తదితరులు పాల్గొన్నారు.



సైకిల్ ర్యాలీలో పాల్గొన్న మెడికల్ విద్యార్థులు

జాతీయ స్థాయి హాకీ పోటీలకు ఎంపిక

యాదగిరిగుట్ట : యాదగిరిగుట్ట మండలం లప్పానాయక్‌తండాకు చెందిన ధీరావత్ శంకర్ జాతీయ స్థాయి హాకీ క్రీడలో స్టాండ్ బైగా ఉండేందుకు అర్హత సాధించాడు. గత నెలలో రంగారెడ్డి జిల్లాలోని నందిగామలో జరిగిన రాష్ట్రస్థాయి హాకీ పోటీల్లో ఉమ్మడి నల్లగొండ జిల్లా తరపున ధీరావత్ శంకర్ ప్రతిభ కనబరిచాడు. టోర్నీలో 6 గోల్స్ కొట్టి సెలక్షన్ కమిటీ దృష్టిలో పడ్డాడు. ఈ నేపథ్యంలోనే వచ్చే ఏప్రిల్ 12వ తేదీ నుంచి 25వ తేదీ వరకు ఒడిశాలో జరిగే జాతీయ స్థాయి హాకీ పోటీల్లో తెలంగాణ నుంచి 18 మంది క్రీడాకారులు పాల్గొననున్నారు. ఇందులో యాదగిరిగుట్ట మండలం లప్పానాయక్‌తండా నుంచి శంకర్ స్టాండ్ బైగా ఎంపిక కావడం పట్ల కుటుంబ సభ్యులు, స్నేహితులు సంతోషం వ్యక్తం చేశారు.



స్టాండ్ బైగా ఎంపికైన శంకర్

ఇంటి నంబర్‌ను రద్దు చేశారని..

- మున్సిపాలిటీ కార్యాలయంలో వ్యక్తి ఆత్మహత్యాయత్నం

భువనగిరి : ఇంటి నంబర్‌ను రద్దు చేశారని ఆరోపిస్తూ ఓ వ్యక్తి మున్సిపల్ కార్యాలయంలో ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. భువనగిరి పట్టణంలోని పహాడీనగర్‌కు చెందిన ఫయాజ్ మెకానిక్ వృత్తి పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. తాను ఉంటున్న ఇంటి నంబర్‌ను మున్సిపల్ అధికారులు రద్దు చేశారని కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం మున్సిపాలిటీ కార్యాలయానికి వెళ్లాడు. మున్సిపల్ కమిషనర్ చాంబర్‌లోకి ప్రవేశించి కమిషనర్‌గా సమస్యను వివరిస్తున్న క్రమంలో తన వెంట బాటిల్లో తెచ్చుకున్న పెట్రోల్‌ను ఒంటిపై పోసుకునే ప్రయత్నం చేస్తుండగా సిబ్బంది గమనించి అతడిని బయటికి తీసుకువచ్చారు. అదే సమయంలో కార్యాలయానికి వచ్చిన చైర్మన్ వాహనం ఎదుట కూర్చున్నాడు. ఈ తన సమస్యను పరిష్కరించాలని కోరాడు. గతంలో ఎన్ని సార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకోవడం లేదని చెప్పారు. దీంతో చైర్మన్, అధికారులు సమస్యల పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటామని చెప్పడంతో అక్కడి నుంచి వెళ్లిపోయ్యారు. కాగా ఆత్యహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తిపై మున్సిపల్ కమిషనర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ సత్యనారాయణ తెలిపారు.

నేడు బుద్ధవనంలో మాఘపౌర్ణమి పూజ

నాగార్జునసాగర్: బుద్ధవనంలోని మహాస్థూపంలో పల గల పంచధ్యాన బుద్ధమందిరంలో మంగళవారం మాఘ పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించనున్నామని ఇండియన్–థాయ్ బౌద్ధభిక్షువు అరుణోభిక్షు తెలిపారు. థాయిలాండ్‌కు చెందిన ధమ్మయూత్ సంప్రదాయంలో ప్రసిద్ధ థాయ్ బౌద్ధగురువు అజాన్మున్ గురువు వద్ద శిక్షణ పొందిన ఆయన 15రోజులు ధమ్మవాసానికై సోమవారం బుద్ధవనాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా స్థూప ప్రదక్షిణ అనంతరం బౌద్ధ ఉపాసకులకు బుద్ధధమ్మ సంఘ అనే త్రిరత్న వందనాన్ని పఠింపజేసి ధమ్మ ప్రవచనాలు వినిపించడంతోపాటు మాఘ పౌర్ణమిపూజ ప్రాశస్త్యాన్ని వివరించారు.



ధ్యానులకు మాఘ పౌర్ణమిపూజ ప్రాశస్త్యాన్ని వివరిస్తున్న అరుణోభిక్షు

యాదాద్రీశుడిని దర్శించుకున్న త్రిపుర మాజీ సీఎం



ఆలయ సన్నిధిలో త్రిపుర మాజీ సీఎం బిప్లబ్‌కుమార్ దేబ్



రామచంద్రయ్య ఇంట్లో భోజనం చేస్తున్న త్రిపుర మాజీ సీఎం

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిని త్రిపుర మాజీ సీఎం, ప్రస్తుత రాజ్యసభ సభ్యుడు బిప్లబ్ కుమార్ దేబ్ సోమవారం సాయంత్రం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ఆచార్యులు సంప్రదాయంగా స్వాగతం పలికారు. గర్భాలయంలో స్వయంభూలను దర్శించుకొని, స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ముఖ మండపంలో ఉత్సవ మూర్తులకు నిర్వహించిన అష్టోత్తరం, సువర్ణ పుష్పార్చన పూజల్లో పాల్గొన్నారు. స్వామివారిని దర్శించుకున్న మాజీ ముఖ్యమంత్రి, ప్రస్తుత రాజ్యసభ సభ్యులు బిప్లబ్ కుమార్ దేబ్‌కు ఆచార్యులు వేద ఆశీర్వచనం చేయగా, అధికారులు లడ్డూ ప్రసాదం అందజేశారు. అనంతరం ప్రధానాలయ విశిష్టతను ఆచార్యులు వివరించారు.

పేదింట్లో భోజనం చేసి..

బీబీనగర్: త్రిపుర మాజీ సీఎం పేదల స్థితిగతులను తెలుసుకునేందుకు మండలంలోని కొండమడుగు గ్రామంలో పర్యటించారు. గ్రామానికి చెందిన పంజాల రామచంద్రయ్య ఇంటికి వెళ్లి వారి కష్ట సుఖాలను తెలుసుకున్నారు. అనంతరం వారు వండిన భోజనాన్ని ఆయన వారితో కలిసి ఆరగించారు. అనంతరం గ్రామానికి మాజీ సీఎం వచ్చినట్లు తెలుసుకున్న కొందరు గ్రామస్తులు అక్కడికి చేరుకొని ఆయనను కలవడంతో రాష్ట్ర పరిపాలన విధానాలు, సంక్షేమ పథకాలు ఏ మేరకు అందుతున్నాయని అడిగి తెలుసుకున్నారు.

మతిస్థిమితం లేని బాలికపై లైంగికదాడి.. ?

నార్కట్‌పల్లి : మతిస్థితిమితం లేని ఓ బాలికపై వృద్ధుడు లైంగికదాడికి పాల్పడ్డాడు. ఈ ఘటన నార్కట్‌పల్లి మండలం జువ్విగూడెం గ్రామంలో ఆలస్యంగా సోమవారం వెలుగులోకి వచ్చింది. విశ్వసనీయ సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. జువ్విగూడెం గ్రామానికి చెందిన మతి స్థిమితం లేని చెవిటి, మూగ బాలిక కొన్ని రోజుల క్రితం ఇంట్లో ఒంటరిగా ఉండగా అదే గ్రామానికి చెందిన వృద్ధుడు వెళ్లాడు. బాలికకు మాయమాటలు చెప్పి లోబర్చుకుని లైంగికదాడి చేశాడు. దీంతో ఇటీవల ఆ బాలిక తీవ్ర అస్వస్థతకు గురైంది. సైగల ద్వారా ఆ బాలిక తనపై జరిగిన అఘాయిత్యాన్ని కుటుంబ సభ్యులకు తెలపడంతో విషయం వెలుగులోకి వచ్చింది. కుటుంబ సభ్యులు ఆ బాలికను ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించగా గర్భవతి అని వైద్యులు నిర్ధారించారు. దీంతో కుటుంబ సభ్యులు అఘాయిత్యానికి పాల్పడిన వృద్ధుడిపై నార్కట్‌పల్లి పోలీస్‌స్టేషన్ ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఈ విషయం తెలుసుకున్న ఆ వృద్ధుడు పరారీలో ఉన్నట్లు గ్రామంలో చర్చ జరుగుతోంది.

సూర్యాపేటలో ప్రైవేట్ ఆస్పత్రి సీజ్

సూర్యాపేట క్రైం : నిబంధనకు విరుద్ధంగా లింగనిర్ధారణ పరీక్షలతో పాటు అబార్షన్లు చేస్తున్నారనే అభియోగం మేరకు జిల్లా కేంద్రంలోని సంజీవని ఆస్పత్రిని డీఎంహెచ్ఓ కోటాచలం సీజ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆస్పత్రిలో ఆకస్మిక తనిఖీలు చేశారు. ఆ సమయంలో యదాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడూరు మండలం గట్టుసింగారం గ్రామానికి చెందిన ఐదు నెలల గర్భిణికి అబార్షన్ చేయకుండా (టాబ్లెట్స్) కడుపులో ఉన్న పిండం బయటకు వచ్చే విధంగా చికిత్స చేస్తుండగా అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నూతనకల్ మండలం దిర్శనపల్లికి చెందిన మహిళకు కూడా అబార్షన్ చేసినట్లు అధికారులు గుర్తించి ఆస్పత్రిని సీజ్ చేశారు.



ఆస్పత్రిని సీజ్ చేస్తున్న డీఎంహెచ్ఓ కోటాచలం

పోచంపల్లిలో బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ విద్యార్థుల సందడి



టూరిజం పార్కులో విద్యార్థుల బృందం

భూదాన్‌పోచంపల్లి : వాక్సన్ యూనివర్సిటీలో బ్యాచలర్ అఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ చదువుతున్న 35 మంది విద్యార్థుల బృందం సోమవారం పోచంపల్లిని సందర్శించారు. టూరిజం పార్కు, చేనేత గృహాలను సందర్శించారు. అక్కడ మగ్గాలు, వాటిపై తయారవుతున్న చేనేత వస్త్రాలు, డిజైన్లను పరిశీలించారు. ముడిసరుకు ఎక్కడ నుంచి కొనుగోలు చేస్తారని, నెలంతా పనిచేస్తే ఎంత గిట్టుబాటు అవుతుందని అడిగి తెలుసుకున్నారు. అలాగే చేనేత ఉత్పత్తులను మార్కెటింగ్ చేస్తున్న పద్ధతులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ ప్రొగ్రామ్ డైరెక్టర్ డాక్టర్ శుభదర్శిని మాట్లాడుతూ ఎక్స్‌ప్లోరర్ విజిట్‌లో భాగంగా ప్రపంచ హెరిటేజ్ విలేజ్‌గా అవార్డు అందుకున్న పోచంపల్లికి సందర్శనకు వచ్చామని పేర్కొన్నారు. మన సంస్కృతి, వారసత్వ సంపదను కాపాడుకొంటూనే వ్యాపారాన్ని ఎలా అభివృద్ధి చేయవచ్చునో అధ్యయనం చేయనున్నట్లు తెలిపారు. చేనేత కార్మికులు సోషల్ మీడియా ద్వారా తమ ఉత్పత్తులను మార్కెటింగ్ చేస్తుండటం శుభ పరిణామమన్నారు. వీరి వెంట విద్యార్థులు చింతల గౌరవరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.



మగ్గాలను పరిశీలిస్తున్న విద్యార్థులు

కల్తీ పాల తయారీదారుడి అరెస్టు

- 110లీటర్ల కల్తీపాలు, పాలపొడర్ ప్యాకెట్‌లు, వివిధ రసాయనాలు స్వాధీనం

చౌటుప్పల్ : మండల పరిధిలోని ఎల్లంబావి గ్రామంలోని కల్తీ పాల తయారీ కేంద్రంపై ఎస్ఓటీ పోలీసులు సోమవారం దాడులు నిర్వహించారు. కల్తీ పాలు తయారు చేస్తున్న బాలెం శేఖర్(35)ను అదుపులోకి తీసుకున్నారు. కొంత కాలంగా గుట్టు చప్పుడు కాకుండా కల్తీ పాల తయారీ దందా నిర్వహిస్తున్న సమాచారం అందుకున్న ఎస్ఓటీ పోలీసులు దాడులు చేశారు. ఈ దాడుల్లో మూడు క్యాన్‌లలో నిల్వచేసిన 110 లీటర్ల కల్తీ పాలు, పాలపొడర్ ప్యాకెట్‌లు, హైడ్రోజన్ పెరాక్సైడ్ ద్రావణం కలిగిన క్యాన్ స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని స్థానిక పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సీతపాండు తెలిపారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న పాల క్యాన్‌లు

కుటుంబ తగాదాలతో వ్యక్తి ఆత్మహత్య

మిర్యాలగూడ : కుటుంబ తగాదాలతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మాడ్గులపల్లి మండలం పాములపాడులో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కేతేపల్లి మండలం తుంగతుర్తి గ్రామానికి చెందిన గునగంటి శ్రీను(37) ఏడేండ్లుగా పాములపాడులో బియ్యం మిల్లును కొనుగోలు చేసి కుటుంబంతోపాటు అక్కడే నివాసం ఉంటున్నాడు. ఇటీవల ఆస్తి పంపకాల విషయంలో కుటుంబ సభ్యులతో తరుచు గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో సోమవారం పాములపాడుకు వచ్చిన తల్లిదండ్రులు, సోదరుడు శ్రీనుతో ఘర్షణ పడి దాడి చేశారు. దీంతో మనస్తాపానికి గురైన శ్రీను ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకున్నాడు. కాసేపటికి కుటుంబ సభ్యులు గమనించేలోపే మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆత్మహత్యకు ముందు తమ పిల్లలను బాగా చూసుకోవాలంటూ శ్రీను రికార్డు చేసిన వాయిస్ మెసేజ్ పలువురిని కలిచివేసింది. ఘటన స్థలాన్ని డీఎస్పీ వెంకటగిరి, రూరల్ సీఐ సత్యనారాయణ, వేములపల్లి ఎస్‌ఐ శ్రీనివాస్ పరిశీలించారు. కాగా, మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ కుటుంబ సభ్యులు, బంధువులు మృతదేహంతో పాములపాడులో ఆందోళన చేశారు. శ్రీను మృతికి కారణమైన వారిని శిక్షించేంతవరకు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని తరలించేది లేదని కుటుంబ సభ్యులు అడ్డుపడ్డారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.



శ్రీను (ఫైల్)

పోలీసులకు సమాచారం అందించాలి



మాట్లాడుతున్న ఏఎస్పీ పీఆర్‌కే ప్రసాద్‌రావు

నార్కట్‌పల్లి: రహదారులపై ప్రమాదాన్ని గుర్తించిన ఫస్ట్ రెస్పాండర్ వెంటనే పోలీస్‌శాఖ, అంబులెన్స్‌కు సమాచారం అందిస్తే ఎంతో మంది ప్రాణాలను కాపాడిన వారమవుతారని ఏఎస్పీ పీఆర్‌కె.ప్రసాద్‌రావు అన్నారు. నార్కట్‌పల్లిలోని వివేరా హోటల్‌లో సోమవారం పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన యాక్సిడెంట్ ఫస్ట్ రెస్పాండర్ కోర్సు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్రథమ చికిత్స నైపుణ్యాన్ని పొంది ఉండాలని సూచించారు. అనంతరం శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్‌లను అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మధుసూదన్ ప్రథమ చికిత్సలో భాగంగా రక్త స్రావం నివారణ చర్యలు, సీపీఆర్ చేసే విధానాన్ని మాక్ డ్రిల్ ద్వారా చేసి చూపించారు. కార్యక్రమంలో రోడ్డు సేఫ్టీ డీఎస్పీ చంద్రభాను, నార్కట్‌పల్లి సీఐ శివధర్‌రెడ్డి, ఎస్‌ఐ బోడిగె రామక్రిష్ణా, ఏఎస్‌ఐ నర్సిరెడ్డి , సురేందర్, శివశంకర్, తిరుమల్, శ్రీనువాస్ , గిరిబాబు పాల్గొన్నారు.

ఎంపీ కోమటిరెడ్డిని అనర్హుడిగా ప్రకటించాలి

- పీసీసీ ఉపాధ్యక్షుడు చెరుకు సుధాకర్‌గౌడ్

చిట్యాల: అసభ్య పదజాలంతో మాట్లాడుతూ చంపుతారంటూ బెదిరింపులకు దిగుతున్న భువనగిరి పార్లమెంట్ సభ్యుడు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని వెంటనే పార్లమెంటు స్పీకర్ అనర్హుడిగా ప్రకటించాలని పీసీసీ ఉపాధ్యక్షుడు చెరుకు సుధాకర్‌గౌడ్ డిమాండ్ చేశారు. చిట్యాల మండలం గుండ్రాంపల్లి గ్రామంలో తన తండ్రి, తెలంగాణ సాయుధ పోరాట యోధుడు చెరుకు ఉషాగౌడ్ వర్ధంతి కార్యక్రమంలో సోమవారం ఆయన పాల్గొని మాట్లాడారు. కోమటిరెడ్డికి తనతో ఎలాంటి వైరం లేకున్నా తనతో పాటు తరచుగా కాంగ్రెస్ పెద్దలను బండ బూతులు తిడుతున్నాడని ఆరోపించారు. ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి నా కుమారుడు సుహాస్‌కు బెదిరింపులకు దిగుతూ ఫోన్ చేసిన కాల్ రికార్డుతో పార్టీ అధిష్టానానికి ఫిర్యాదు చేస్తానని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని డ్యామేజీ చేసే విధంగా ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.

బెదిరింపులకు పాల్పడడం సరికాదు

బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలపై పోరాటం చేయాల్సిన ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి స్వపక్ష పార్టీకి చెందిన చెరుకు సుధాకర్‌గౌడ్‌ను బెదిరించడం తగదని పీసీసీ అధికార ప్రతినిధి అద్దంకి దయాకర్ అన్నారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ గతంలో పార్టీ నాయకులు ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పట్ల మర్యాదగా వ్యవహరించలేదని క్షమాపణలు చెప్పించుకుని ఇప్పుడు బీసీ వర్గానికి చెందిన సుధాకర్‌గౌడ్ పట్ల వ్యవహరించిన తీరును పునరాలోచన చేసుకోవాలన్నారు. పీసీసీ అధికార ప్రతినిధి పున్న కైలాస్‌నేత మాట్లాడుతూ ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రజాప్రతినిధిగా ఎన్నికయ్యేందుకు సహకరించిన బీసీ, ఎస్సీ వర్గాల పట్ల వ్యవహరిస్తున్న తీరు సరైంది కాదన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



తండ్రి సమాధి వద్ద నివాళులర్పిస్తున్న చెరుకు సుధాకర్‌గౌడ్ తదితరులు

ప్రభుత్వ భూమి పేదలకు కేటాయించాలి

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : దశాబ్దాలుగా గుడిసెలు వేసుకుని జీవనం సాగిస్తున్న పేదలకు ప్రభుత్వ భూమిని కేటాయించాలని నేరేడుచర్ల గ్రామానికి చెందిన ప్రజలు కోరారు. సోమవారం కలెక్టరేట్ ముందు నేరేడుచర్ల మున్సిపాలిటీకి చెందిన 60మంది బాధితులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేరేడుచర్ల రెవెన్యూ శివారులోని 206, 226, 231, 243, 244, 250, 253, 258,470 సర్వే నంబర్ లోని ప్రభుత్వ భూముల్లో 210మంది జీవిస్తున్నామని తెలిపారు. ఏళ్ల తరబడి తాము నివాసం ఉంటున్న స్థలాలను ఖాళీ చేయించి రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులకు కట్టిపెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. అధికారులు స్పందించి ఖబ్జాకు గురవుతున్న ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకొని పేదలకు అందించాలని కోరారు. ఈ ధర్నాలో వాసా పుల్లయ్య, యండి హుస్సేన్, కరుణాకర్, పురుషోత్తం పాల్గొన్నారు.



సూర్యాపేట కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న పేదలు

క్లుప్తంగా

రోడ్డు మరమ్మతులు చేపట్టాలి

రామన్నపేట : రామన్నపేట– కక్కిరేణి గ్రామాల మధ్య దెబ్బతిన్న రోడ్డుకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని సీపీఎం మండల ప్రధాన కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం కోరారు. సోమవారం ఇస్కిళ్ల శివారులో గుంతలమయంగా మారిన రోడ్డును పరిశీలించి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో వేముల సైదులు, యాదయ్య, మహేందర్, శివకుమార్, అండాలు, ఐలయ్య పాల్గొన్నారు.

శతాధిక వృద్ధుడి మృతి


యాదగిరి గౌడ్ (ఫైల్)

మోటకొండూర్: మండలంలోని ఇక్కుర్తి గ్రామానికి చెందిన అయిలి యాదగిరి గౌడ్ (104) అనారోగ్య కారణాలతో సోమవారం సాయంత్రం మృతిచెందాడు. ఆయనకు ముగ్గురు ఆడ పిల్లలు, ముగ్గురు మగ సంతానం.

బస్టాండ్ తరలించొద్దని వినతి


వైటీడీఏ వైస్ చైర్మన్ కిషన్‌రావుకు వినతిపత్రం ఇస్తున్న అఖిలపక్ష నాయకులు

యాదగిరిగుట్ట: పట్టణంలోని బస్టాండ్‌ను తరలించొద్దని కోరుతూ వైటీడీఏ వైస్ చైర్మన్ కిషన్ రావు, దేవాదాయ ధర్మదాయ శాఖ అడిషనల్ కమిషనర్ జ్యోతి, ఆర్టీసీ ఈడీ వినోద్ కుమార్, ఈడీపీటీ మునిశేఖర్‌లను సోమవారం అఖిల పక్ష నాయకులు కలిసి వినతిపత్రాలు అందజేశారు. బస్టాండ్‌ను ఆధారంగా చేసుకుని వందలాది కుటుంబాలు బతుకుతున్నాయని అఖిల పక్షం నాయకులు తెలిపారు. బస్టాండ్‌ను తరలిస్తే విద్యార్థులకు, పట్టణ ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. కొండపైకి ఆటోలు నడపడానికి అనుమతులు ఇచ్చి, ఆటో కార్మికుల ఉపాధిని కాపాడాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో సీపీఐ జిల్లా సమితి సభ్యులు బబ్బూరి శ్రీధర్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ కాటబత్తిని ఆంజనేయులు, సీపీఎం మండల కార్యదర్శి పోశెట్టి, డీసీసీ కార్యదర్శి సతీష్‌రాజ్, బండి అనిల్ పలువురు నాయకులు తదితరులున్నారు.

వెల్లంకిలో ఇంటింటికి టీడీపీ

రామన్నపేట : మండలంలోని వెల్లంకి గ్రామంలో సోమవారం టీడీపీ భువనగిరి పార్లమెంట్ ఇన్ చార్జ్ కుందారపు కృష్ణమాచారి ఆధ్వర్యంలో ఇంటింటికి టీడీపీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఈతాకుల అంజయ్య, రాష్ట్రకార్యదర్శి రాపోలు నర్సింహ, తాళ్లపల్లి సత్తిరెడ్డి, నూకల శ్రీధర్‌రెడ్డి, నీల యాదయ్య, పోచబోయిన నర్సింహ, గణేష్, మీర్జా ఫజల్ బేగ్, కర్రె మల్లేశం, రాజేష్, భీమయ్య, రాపోలు బలరాం,యాదగిరి పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై దృష్టిసారించాలి

చౌటుప్పల్ : విద్యార్థులు ఆరోగ్యంపై దృష్టిసారించాలని వైస్ ఎంపీపీ ఉప్పు భద్రయ్య, సర్పంచ్ ఆకుల సునిత అన్నారు. మండలంలోని ఎస్.లింగోటం గ్రామంలోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో సోమవారం దివీస్ పరిశ్రమ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని వారు ప్రారంభించారు. విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో దివీస్ ప్రతినిధులు వల్లూరి వెంకటరాజు, సాయికృష్ణ, ప్రధానోపాధ్యాయులు ఉన్నారు.

సబ్సిడీ గొర్రెల పంపిణీ

చౌటుప్పల్ : మండల పరిధిలోని మందోళ్లగూడెం గ్రామానికి చెందిన 11మంది లబ్ధిదారులకు సోమవారం సబ్సిడీ గొర్రెలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి కృష్ణ, ప్రత్యేకాధికారులు గోపిరెడ్డి, సంజీవరావు, మండల కమిటీ సభ్యులు శ్రావణ్‌కుమార్, రాములు, సుధాకర్‌రావు, సర్పంచ్ చంద్రకళ, పెంపకందారుల సంఘం అధ్యక్షుడు వెంకటేష్ పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మరక్షణకు కరాటే దోహదం

మోత్కూరు : ఆత్మరక్షణకు కరాటే దోహదపడుతుందని ఎస్ఐ వి.జానకిరాంరెడ్డి, ఇండియన్ రెడ్‌క్రాస్ జిల్లా అధ్యక్షుడు గుర్రం లక్ష్మీనర్సింహా రెడ్డి అన్నారు. ఆత్మకూర్ (ఎం) మండల కేంద్రంలో విక్టరీ షాటోకాన్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సౌత్ ఇండియన్ కరాటే పోటీలలో మండలానికి చెందిన సాయి చైతన్య హైస్కూల్ విద్యార్థుల పాల్గొని మెడల్స్‌ను సాధించారు. సోమవారం ప్రతిభ కనిబరిచ్చిన విద్యార్థులను ఎస్ఐ, పాఠశాల ఉపాధ్యాయ బృందం అభినందించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి, ఏఎస్ఐ కరుణాకర్, కరాటే గ్రాండ్ మాస్టర్ పి.బాలరాజు, రెడ్‌క్రాస్ ప్రతినిధులు కె.నర్సిరెడ్డి, కరాటే మాస్టర్ అన్నెపు వెంకట్ పలువురు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

అడ్డగూడూరు : ఆత్మకూరు మండల కేంద్రంలో జరిగిన మార్షల్ ఆర్ట్స్ ఛాంపియన్ షిప్ 2023 పోటీల్లో స్థానిక కేజీబీవీ విద్యార్థులు పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు సోమవారం ఎస్ఓ సరిత తెలిపారు. ప్రతిభ కనిబరిచిన విద్యార్థులను అభినందించారు.

వలిగొండ : ఆత్మకూరు (ఎం) మండలంలో ఆదివారం నిర్వహించిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో మండల కేంద్రంలోని గాయత్రీ పాఠశాల విద్యార్థులు పాల్గొని బంగారు, వెండి పతకాలు సాధించారు. పతకాలు సాధించిన విద్యార్థిని విద్యార్థులను సోమవారం ఎంపీడీఓ గీతారెడ్డి అభినందించారు.

భువనగిరి మున్సిపల్ బడ్జెట్‌కు ఆమోదం

- రూ. 50.72 కోట్ల అంచనాతో రూపొందించిన బడ్జెట్
- 14 మంది అధికార పార్టీకి చెందిన కౌన్సిలర్లు హాజరు
- సమావేశాన్ని వాయిదా వేయాలని ప్రతిపక్ష కౌన్సిలర్ల నిరసన


సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ ఆంజనేయులు


పోడియం ఎదుట కూర్చొని నిరసన తెలుపుతున్న కాంగ్రెస్, బీజేపీ కౌన్సిలర్లు

భువనగిరి : భువనగిరి మున్సిపాలిటీ 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్ కౌన్సిల్ ఆమోదం పొందింది. మున్సిపల్ చైర్మన్ ఆంజనేయులు అధ్యక్షతన అదనపు కలెక్టర్ దీపక్ తివారీ ఆధ్వర్యంలో సోమవారం మున్సిపల్ బడ్జెట్ సమావేశాన్ని నిర్వహించారు. అధికార పార్టీకి చెందిన 14 మంది కౌన్సిలర్లు 2023–24 ఆర్థిక సంవత్సరానికి రూ. 50.72 కోట్ల ఆదాయం అంచనాతో రూపొందించిన బడ్జెట్‌కు ఆమోదం తెలిపారు. రూ. 50.77 కోట్ల అంచనా వ్యయం ఉండగా బడ్జెట్‌లో ప్రారంభం నిల్వ కింద రూ.28లక్షలు పేర్కొని, ముగింపు నిల్వ రూ.23.66లక్షలు ఉన్నట్లు చూపించారు. సమావేశంలో వైస్ చైర్మన్ కిష్టయ్య, కమిషనర్ నాగిరెడ్డి, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిపక్ష కౌన్సిలర్ల నిరసన

మధ్యాహ్నం ప్రారంభమైన మున్సిపల్ బడ్జెట్ సమావేశానికి బీజేపీ పార్టీకి చెందిన 7గురు, కాంగ్రెస్ పార్టీకి చెందిన 10మంది కౌన్సిలర్లు హాజరయ్యారు. బడ్జెట్ సమావేశాన్ని వాయిదా వేయాలని డిమాండ్ చేశారు. పోడియం ఎదుట కూర్చొని నిరసన తెలిపారు. అంతకు ముందు కలెక్టర్, మున్సిపల్ చైర్మన్‌కు వినతిపత్రం అందజేశారు. మున్సిపల్ చైర్మన్‌పై పెట్టిన అవిశ్వాసం కోసం సమావేశం ఏర్పాటు చేయాలని, ఇటీవల టీయూఎఫ్ఐడీసీ ద్వారా తీసుకువచ్చిన రూ.17.50 కోట్ల నిధులను కౌన్సిల్‌లో ఆమోదం లేకుండా, అభివృద్ధి పనులను టెండర్లు వేసిన తర్వాతే నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీకి చెందిన ఫ్లోర్‌లీడర్లు మాయ దశరథ, పోత్నక్ ప్రమోద్‌కుమార్, కౌన్సిలర్లు ఉన్నారు.

హాజరు కాని అధికారపార్టీ కౌన్సిలర్లు

భువనగిరి మున్సిపాలిటీలో మొత్తం 35 మంది కౌన్సిలర్లు ఉన్నారు. ఇటీవల ప్రతి పక్ష పార్టీతో పాటు అధికార పక్షానికి చెందిన ఇద్దరితో కలిసి మొత్తం 19 మంది సంతకాలు చేసి అవిశ్వాస పత్రాన్ని కలెక్టర్‌కు అందజేశారు. కాగా బడ్జెట్ సమావేశానికి కాంగ్రెస్ పార్టీకి చెందిన 10, బీజేపీకి చెందిన ఏడుగురితో పాటు అధికార పార్టీకి చెందిన ముగ్గురు సమావేశానికి హాజరుకాలేదు. దీంతో బడ్జెట్ సమావేశం వాయిదా పడుతుందా ఆమోదం పొందుతుందా అనే ఉత్కంఠ నెలకొంది. తాజాగా వచ్చిన చట్టం ప్రకారం 35 మందికి 12 మంది ఉంటే కోరం ఉన్నట్లుగా భావించి చర్చను ప్రారంభించుకుని ఆమోదం తెలుపుకోవడానికి అవకాశం ఉందని ప్రకటించారు. దీంతో 14 మంది అధికార పార్టీకి చెందిన కౌన్సిలర్లు హాజరు కావడంతో బడ్జెట్‌కు ఆమోదం లభించింది.

కేసీఆర్ నాయకత్వమే దేశానికి శ్రీరామ రక్ష

- ప్రభుత్వ విప్ సునీతామహేందర్‌రెడ్డి


మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ గొంగిడి సునీత

గుండాల : కేసీఆర్ నాయకత్వమే దేశానికి శ్రీరామ రక్ష అని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ మండల విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సబ్బండ వర్గాల అభివృద్ధి కోసం సీఎం కేసీఆర్ చేస్తున్న కృషి చేస్తున్నారన్నారు. రాష్ట్ర గొర్రెల, మేకల అభివృద్ధి సంస్థ చైర్మన్ దూదిమెట్ల బాలరాజు యాదవ్ మాట్లాడుతూ రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ పార్టీలను బొంద పెట్టాలన్నారు. అనంతరం మండలంలోని పలు గ్రామాలకు చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్య గౌడ్, టి స్కాబ్ వైస్ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి, మదర్ డెయిరీ చైర్మన్ శ్రీకర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు ఎండీ ఖలీల్, ఎంపీపీ తాండ్ర అమరావతి, జెడ్పీటీసీ కోలుకొండ లక్ష్మి, వైస్ ఎంపీపీ మహేశ్వరం మహేందర్‌రెడ్డి, నాయకులు ఎం.రామకృష్ణారెడ్డి, దార సైదులు, దుంపల శ్రీనివాస్, శ్రీనివాస్, జె.కొమురయ్య, గిరికత్తుల శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.

ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని కాంగ్రెస్ నుంచి సస్పెండ్ చేయాలి

మోత్కూరు: డాక్టర్ చెరుకు సుధాకర్‌ను చంపుతానని బెదిరించిన ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని కాంగ్రెస్ నుంచి సస్పెండ్ చేయాలని బీసీ యువజన సంఘం జాతీయ అధ్యక్షుడు గడ్డం నర్సింహ, బీసీ రిజర్వేషన్ సాధన సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు బుర్ర శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం మోత్కూరులో బీసీ విద్యార్థి యువజన సంఘాల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుధాకర్ గౌడ్‌కు క్షమాపణలు చెప్పాలన్నారు. సమావేశంలో వినోద్, సందీప్, విజయ్, సాయి, స్వాతి, ప్రత్యుష, మనీషా, ప్రభాకర్, నర్సింహ, శ్వేత, శిరీష ఉన్నారు.

సంస్థాన్ నారాయణపురం: చెరుకు సుధాకర్‌గౌడ్‌పై ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ మండల కేంద్రంలో గౌడ సంఘం నాయకుల ఆధ్వర్యంలో సోమవారం రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమంలో యాదయ్య, యాదగిరి, కార్తీక్, యాదిగిరి, సుర్వి యాదయ్య, లింగస్వామి, సత్తయ్య, శ్రీరాములు, లింగన్న ఉన్నారు.

ప్రతిఒక్కరూ మహిళలను గౌరవించాలి


రామన్నపేట : మాట్లాడుతున్న సీడీపీఓ శైలజ

యాదగిరిగుట్ట: ప్రతిఒక్కరూ మహిళలను గౌరవించాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు వట్టిపల్లి శ్రీనివాస్‌గౌడ్, దళిత మోర్చా జాతీయ నాయకుడు వేముల అశోక్, జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు సుర్వి లావణ్య, జిల్లా నాయకుడు రచ్చ శ్రీనివాస్ అన్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం పట్టణంలోని బుచ్చిదాసు ఆశ్రమంలో బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో పలువురు మహిళలను సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మగాని రాజమణి, పట్టణ అధ్యక్షురాలు బోడ రాధ, ప్రధాన కార్యదర్శి బొడ్డు సుజాత, రంగ రేఖ, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

మహిళల అభ్యున్నతికి అధిక ప్రాధాన్యం

రామన్నపేట : మహిళల అభ్యున్నతికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందని ఎంపీపీ కన్నెబోయిన జ్యోతి,సీడీపీఓ శాగంటి శైలజ అన్నారు. సోమవారం మండలకేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రపంచ మహిళా దినోత్సవ వేడుకల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ ఉద్యోగులు స్థానిక ప్రజాప్రతినిధులను సన్మానించారు. కిశోర బాలికలకు క్రీడా పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ గాదె జలేందర్‌రెడ్డి, ఎంపీటీసీ వనం హర్షిని వార్డుసభ్యులు జహేరాబేగం, లవనం రాధిక సూపర్‌వైజర్ హేమలత, అంగన్‌వాడీ టీచర్లు సువర్ణ, లలిత, ప్రవీణ, లలిత, రేణుక, పుష్ప, కవిత, మణెమ్మ పాల్గొన్నారు.

బీబీనగర్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయం వద్ద మహిళలకు పలు అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ భాగ్యలక్ష్మిశ్రీనివాస్, ఉప సర్పంచ్ దస్తగిరి పాల్గొన్నారు.

మహిళా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

తుర్కపల్లి : మహిళా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎంపీపీ భూక్యా సుశీల రవీందర్ నాయక్ అన్నారు. అంతర్జాతీయ మహిళల దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని దత్తాయపల్లి జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచ్ వెన్నుకూచి రామ్మోహన్ శర్మ, ఎంపీటీసీ గిద్దె కరుణాకర్, సీడీపీఓ చంద్రకళ, ఎంపీడీఓ మానే ఉమాదేవి ,అంగన్‌వాడీ సూపర్‌వైజర్ విజయ రాణి, రాణి, భాగ్యలక్ష్మి, సంపత్ కుమారి, మంజుల, రామ దేవి , స్వప్న, వరలక్ష్మి , నవనీత పాల్గొన్నారు.

రాజాపేట : మహిళా చట్టాలపై అవగాహన కలిగిఉండాలని సర్పంచ్ గాడిపల్లి శ్రవణ్, ఉపాధ్యాయులు స్వప్న అన్నారు. సోమవారం మండలంలోని రఘునాథపురం గ్రామంలో అంతర్జాతీయ దినోత్సవం పురస్కరించుకుని ఐసీడీఎస్ అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు సుజాత, రజిత, ఉపాధ్యాయులు సునీత, పార్వతి పాల్గొన్నారు.

విద్యార్థులు మానసిక ఒత్తిడిని అధిగమించాలి


మోత్కూరు : మాట్లాడుతున్న సురేష్‌కుమార్

మోత్కూరు : పదవ తరగతి విద్యార్థులు మానసిక ఒత్తిడి తట్టుకొని పరీక్షలు రాయాలని మండల విద్యాధికారి వేపూరి శ్రీధర్ అన్నారు. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో మోత్కూర్ మండల పదో తరగతి విద్యార్థులకు స్థానిక హైస్కూల్ లో వ్యక్తిత్వ వికాస తరగతులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గుండాల మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సురేష్ వివిధ అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు టి.అంజయ్య, ఎం.అగ్గిరాములు, ఉపాధ్యాయులు రాంప్రసాద్, రాంరెడ్డి, గాదె వెంకటేశ్వర్లు, వెంకటాచారి, వెంకన్న, నిజాం, ప్రవీణ్, అచ్చిరెడ్డి పాల్గొన్నారు.

గుండాల : పదో తరగతి విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా పరీక్షలు రాయాలని ఎంఈఓ శ్రీధర్ అన్నారు. సోమవారం మండలంలోని ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు మోటివేషన్ క్లాసులను నిర్వహించారు. కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సి పాల్ సురేష్‌బాబు, గిరివర్ధన్, డాక్టర్ హేమావతి, యాదగిరి, రవీందర్ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

మహిళా దినోత్సవాన్ని జయప్రదం చేయాలి

ఆలేరురూరల్ : ఈ నెల 8న పట్టణ కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో నిర్వహించనున్న మహిళ దినోత్సవాన్ని జయప్రదం చేయాలని ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

మత్స్యకార్మిక సంఘం అధ్యక్షుడిగా చలపతి

వలిగొండ : మండలంలోని గోకారం మత్స్యకార్మిక సహకార సంఘం సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడిగా నూతి చలపతిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా కట్ట దానయ్య, ప్రధాన కార్యదర్శిగా నూకల లింగస్వామి, కోశాధికారిగా నూకల పాండును ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మత్స్యకార్మిక సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ కమిటీ అధ్యక్షుడిగా జంగయ్య

సంస్థాన్ నారాయణపురం: మండల కేంద్రంలోని శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయ కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చిలివేరు జంగయ్య, ప్రధాన కార్యదర్శిగా మురళీ ఎన్నికయ్యారు.

ప్రధానోపాధ్యాయుడికి వినతి

చౌటుప్పల్ : పట్టణ కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనంలో చోటు చేసుకుంటున్న అక్రమాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు సోమవారం ప్రధానోపాధ్యాయుడు ప్రసాద్‌రావుకు వినతిపత్రం అందజేశారు.

చలివేంద్రం ప్రారంభం

చౌటుప్పల్ : మండల పరిధిలోని ఎల్లంబావి గ్రామ మెయిన్ రోడ్డులో కంకల భీరయ్య ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సర్పంచ్ గుర్రం కొండయ్య సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రతాప్‌రెడ్డి, దేవేందర్, కృష్ణ, సత్యమూర్తి ఉన్నారు.

ఆర్థికసాయం అందజేత

మోత్కూరు : మోత్కూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1992–1993 పదవ తరగతి బ్యాచ్‌కు చెందిన బాల్య మిత్రుడు మాదాసు సురేష్ ఇటీవల మృతి చెందాడు. ఆ బ్యాచ్ వాట్సాప్ గ్రూపు ద్వారా సేకరించిన రూ.50,516 నగదును సోమవారం సురేష్ కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పసల విజయ, రాపోలు సుదర్శన్, గజ్జి నటరాజ్, యాస రాంరెడ్డి, జిక్కి, శ్రీనివాస్, వాసం ప్రసాద్, తిరుమల్, వెంకట్‌రెడ్డి, కృష్ణమాచారి, కృష్ణ, వెంకన్న, లతీఫ్, చందు, రాజశేఖర్, రమణ, విక్రమ్, రమాదేవి, రాధిక, శాబు పాల్గొన్నారు.

పరీక్ష ప్యాడ్ల పంపిణీ

మోత్కూరు : మోత్కూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదవ తరగతి విద్యార్థులకు న్యాయవాది, కాంగ్రెస్ పార్టీ నాయకుడు అన్నెపర్తి జ్ఞానసుందర్ సోమవారం పరీక్షప్యాడ్లు పంపిణీ చేశారు. పాఠశాల లైబ్రరీకి భారత రాజ్యాంగం, తెలంగాణ రైతు చట్టం పుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు తాడూరి అంజయ్య, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు ప్రశాంత్, మండల అధ్యక్షుడు శ్రీను, నాయకులు గంగాధరి శ్రీధర్, వంశీ, సతీష్ పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ అందజేత

అడ్డగూడూరు : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశా ల పదోతరగతి విద్యార్థులకు సోమవారం కాంగ్రెస్ నాయకుడు జ్ఞానసుందర్ స్టడీ మెటీరియల్ అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రహిమున్నీసా, వల్లంభట్ల రవి, పిచ్చయ్య, శ్రీదర్, శ్రీను, వంశీ, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

జనార్దన్ రెడ్డిని గెలిపించాలని ప్రచారం

రాజాపేట : మండలంలోని పప్రభుత్వ పాఠశాలల్లో సోమవారం పీఆర్‌టీయూ బలపరిచిన అభ్యర్థి కాటేపల్లి జనార్దన్ రెడ్డిని గెలిపించాలని కోరుతూ ఆ సంఘం నాయకులు ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు గిరిధర్ రేపాక, భాస్కర్, గోపాల్, కొండల్‌రెడ్డి పాల్గొన్నారు.

సీరియల్ ప్రకారం నష్టపరిహారం ఇవ్వాలి

భువనగిరిటౌన్ : బస్వాపురం రిజర్వాయర్‌లో ముంపునకు గురవుతున్న బీఎన్‌తిమ్మాపురం గ్రామస్తులకు సీరియల్ ప్రకారం నష్టపరిహారం ఇవ్వాలని కోరుతూ భువనగిరి సింగిల్ విండో మాజీ చైర్మన్ ఎడ్ల సత్తిరెడ్డి సోమవారం ప్రాజెక్ట్ ఈఈ కుర్షిద్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ ఉడుత శారదాఆంజనేయులు, ఉప సర్పంచ్ ఎడ్ల దర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం


భూదాన్‌పోచంపల్లి : స్వపరిపాలన దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు


బొమ్మలరామారం : నాగినేనిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో..

భూదాన్‌పోచంపల్లి : పట్టణంలోని గౌతమి హైస్కూల్‌లో సోమవారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ రావుల జంగయ్య, ఉపాధ్యాయులు భారత బెనర్జీ, పాండురంగం, నర్సయ్య, వెంకటేశ్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

వలిగొండ : మండలంలోని గోకారం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో సోమవారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మేడి యాదయ్య, పాఠశాల చైర్మన్ లింగస్వామి పాల్గొన్నారు.

సంస్థాన్ నారాయణపురం: మండలంలోని జనగాం గ్రామంలోని నేతాజీ పాఠశాలలో సోమవారం స్వపారిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయులుగా వ్యవహరించి అలరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాడెంట్ ఎర్ర రాములు తదితరులు పాల్గొన్నారు.

చౌటుప్పల్ : పట్టణ కేంద్రంలోని గౌతమ్ స్కూల్‌లో సోమవారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చిందం గణేశ్వర్, కరస్పాండెంట్ చిందం శ్రీలేఖ, ఉపాధ్యాయులు జిలాని, అక్షిత, సతీష్, మాలతి, మమత, మనోహర్, సంతోష, నవిత, సరోజ, రంగయ్య, శ్రీలత, శాలిని, అశ్విని పాల్గొన్నారు.


తుర్కపల్లి : గంధమల్ల జెడ్పీహెచ్ఎస్‌లో..


చౌటుప్పల్ : గౌతమి పాఠశాలలో..

అడ్డగూడూరు : మండల పరిధిలోని డీ.రేపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం స్వపరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, ఉపాధ్యాయులు రామలింగయ్య, సుప్రియ, వెంకన్న, నరేందర్ పాల్గొన్నారు.

బొమ్మలరామారం : మండల కేంద్రంతో పాటు నాగినేనిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో నాగినేనిపల్లి జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, గిరీష్ కుమార్, స్వామి, దినేష్, జగన్, వెంకట్ రెడ్డి, సల్మా ఉన్నారు.

తుర్కపల్లి: మండలంలోని గంధమల్ల జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో సోమవారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు శ్రీదేవి, ఎస్ఎంసీ చైర్మన్ తిరుపతి, ఉపాధ్యాయులు శివరాజు, శ్రీనివాస్, రాధిక, నాగమణి, సుధారాణి పాల్గొన్నారు.


వలిగొండ : గోకారం ప్రభుత్వ పాఠశాలలో..


అడ్డగూడూరు : డీ.రేపాక పాఠశాలలో..


సంస్థాన్ నారాయణపురం: నేతాజీ పాఠశాలలో..

మనోహర్ కుటుంబాన్ని ఆదుకోవాలి


ధర్నా చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

భువనగిరి : ఇంటర్ విద్యార్థి మనోహర్ కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్ర ఆస్పత్రి ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన హాస్టల్ వార్డెన్‌ను సస్పెండ్ చేయాలన్నారు. విషయం తెలుసుకున్న కలెక్టర్ పమేలా సత్పతి మృతిడికుటుంబానికి రూ. 50 వేలు, కుటుంబంలో ఒకరికి అవుట్‌సోర్సింగ్ ఉద్యోగంతో పాటు ప్రభుత్వ పరంగా వచ్చే ఎక్స్‌గ్రేషియాను చెల్లిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు బట్టు రామచంద్రయ్య, మాజీ మున్సిపల్ చైర్మన్ బర్రె జహంగీర్, శివలింగం, రవివర్ధన్, బర్రె నరేష్,రావుల రాజు, వనం రాజు,, ఎండి అతహార్, సత్యనారాయణ, కృష్ణ, శివ, మహేష్, నివాస్ తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా కల్యాణ మహోత్సవం


భూదాన్‌పోచంపల్లి : కల్యాణాన్ని జరిపిస్తున్న అర్చకులు

భూదాన్‌పోచంపల్లి : మున్సిపల్ కేంద్రంలోని శ్రీ లక్ష్మీనారాయణస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం శ్రీ లక్ష్మీనారాయణస్వామి కల్యాణ మహోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. ఉత్సవమూర్తులకు పట్టు వస్త్రాలను ధరింపజేసి, ముత్యాల తలంబ్రాలు పోసి మంగళ వాయిద్యాలు, వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య కల్యాణాన్ని వైభవంగా జరిపించారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సతీమణి పైళ్ల వనీత శేఖర్ రెడ్డి, ఎంపీపీ, మాడ్గుల ప్రభాకర్ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ చిట్టిపోలు విజయలక్ష్మిశ్రీనివాస్, జెడ్పీటీసీ కోట పుష్పలత మల్లారెడ్డి, దేవాలయకమిటీ చైర్మన్ అంకం యాదగిరి పాల్గొన్నారు.

దేవాలయానికి వెండి వస్తువుల బహూకరణ

లక్ష్మీనారాయణస్వామి దేవాలయానికి మున్సిపల్ చైర్‌పర్సన్ చిట్టిపోలు విజయలక్ష్మి శ్రీనివాస్ పలువ వెండి వస్తువులు బహూకరించారు. కార్యక్రమంలో దేవాలయకమిటీ చైర్మన్ అంకం యాదగిరి, గునిగంటి మల్లేశ్, అంకం పాండు, జినుకల యాదగిరి, ధర్మకర్తలు పాల్గొన్నారు.

బొమ్మలరామారం : మండలంలోని సోలీపేట్ గ్రామంలో సోమవారం భ్రమరాంభ మల్లిఖార్జున స్వామి కేతమ్మ కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ ధరలు తగ్గించాలని ధర్నా

గుండాల : గ్యాస్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. అనంతరం తహసీల్దార్ జి.జ్యోతికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి మద్దెపురం రాజు, సత్యనారాయణ, ఖలీల్, బాలయ్య, భిక్షం, అంజయ్య, లింగయ్య, అబ్బ య్య, వెంకటయ్య, మల్లయ్య, నర్సయ్య పాల్గొన్నారు.

ఎడ్ల మహేందర్‌రెడ్డికి సన్మానం

రామన్నపేట : సొంత నిధులతో నిర్మించిన పంచాయతీ భవనాన్ని గ్రామానికి అంకితం చేసిన వెల్లంకి సర్పంచ్ ఎడ్ల మహేందర్‌రెడ్డిని సోమవారం కూరెళ్ల గ్రామంలోని గ్రంథాలయంలో దాశరథి పురస్కార గ్రహీత డాక్టర్ కూరెళ్ల విఠలాచార్య సన్మానించారు. కార్యక్రమంలో దుబ్బాక కృష్ణారెడ్డి, ఎడ్ల కృష్ణా రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, పోలు చంద్రశేఖర్ రెడ్డి, ఎడ్ల జగన్మోహన్‌రెడ్డి, స్వామి పాల్గొన్నారు.

శివాలయంలో విశేష పూజలు

యాదగిరిగుట్ట : యాదాద్రీశుడికి సోమవారం అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. అదేవిధంగా శ్రీపర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరాలయంలో మహాశివుడికి అభిషేకాలు, అర్చనలు జరిపించారు. వివిధ పూజల ద్వారా శ్రీస్వామి వారికి రూ.27,16,337ల నిత్య ఆదాయం వచ్చినట్లు అధికారులు వెల్లడించారు.

అభివృద్ధి పనుల పరిశీలన

బీబీనగర్: మండలంలోని భట్టుగూడెం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న అభివృద్ధి పనులను సోమవారం ఎంపీపీ యర్కల సుధాకర్‌గౌడ్ పరిశీలించారు. అనంతరం విద్యార్థులకు దివీస్ పరిశ్రమ సమకూర్చిన వాటర్ బాటిళ్లను విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు బాలచందర్, సర్పంచ్ మాధవిపురుషోత్తం తదితరులు ఉన్నారు.

కంటివెలుగు శిబిరాలు ప్రారంభం

రామన్నపేట : మండలంలోని సూరారం గ్రామంలో సోమవారం ఏర్పాటు చేసిన కంటివెలుగు శిబిరాన్ని సోమ సర్పంచ్ పోలబోయిన అండాలు నర్సింహ, ఎంపీటీసీ దోమల సతీష్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అశ్వినికుమార్, చందన, అరుణ, గీత, పంచాయతీ కార్యదర్శి వేణు పాల్గొన్నారు.

ఆలేరురూరల్ : మండలంలోని కొల్లూరు గ్రామంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని సోమవారం పల్లె దావఖాన డాక్టర్ సుప్రియ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎమ్ జయమ్మ, విజయ, ఆశావర్కర్లు లక్ష్మి, పాల్గొన్నారు.

భూదాన్‌పోచంపల్లి : పట్టణ కేంద్రంలోని 9వ వార్డులోని కేవీటీ స్పోర్ట్స్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని సోమవారం మున్సిపల్ చైర్‌పర్సన్ చిట్టిపోలు విజయలక్ష్మిశ్రీనివాస్, స్థానిక కౌన్సిలర్ భోగ భానుమతివిష్ణుతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ బాత్క లింగస్వామి, కో ఆప్షన్‌సభ్యులు పాల్గొన్నారు.

తుర్కపల్లి : మండలంలోని రాంపూర్ తండాలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని సోమవారం ఎంపీపీ భూక్యా సుశీల రవీందర్ నాయక్ ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ రమావత్ మంజుల మహేందర్ నాయక్ ,ఉపసర్పంచ్ , శ్రీవాత్సవ్ రెడ్డి , జోషి కుమారి తదితరులు పాల్గొన్నారు.